## బీఆర్ఎస్ ప్లెక్సీలు చించివేయడం పిరికిపందల చర్య



ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కేశోరాం కాంట్రాక్టు కార్మికులు

పాలకుర్తి,నవంబర్5: బసంత్‌నగర్‌లో రాజీవ్‌రహదారిపై బీఆర్ఎస్ నాయకులు, కేశోరాం కార్మికులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేయడంపై బీఆర్ఎస్ నాయకులు రాజీవ్ రహదారిపై మంగళవారం ఆందోళన చేశారు. కేశోరాం కాంట్రాక్టు కార్మికసంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకుడు కౌశికహరి ప్యానెల్ విజయం సాధించినప్పటి నుంచి ఈ ప్రాంతంలో తమ పార్టీ ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను కావాలని చించి వేస్తున్నారని కాంట్రాక్టు కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్ బసంత్‌నగర్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కౌశికహరి, బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేక, గిట్టని వారు ఫ్లెక్సీలు చించడం పిరికిపందల చర్య అని వారు అభివర్ణించారు. ఆందోళనలో బీఆర్ఎస్ నాయకులు బత్తిని సతీశ్ గౌడ్, పెద్దపల్లి నాగరాజు, బైరి రామకృష్ణగౌడ్, మాదాసు సతీశ్, కండె స్వామి, కొమ్ము శ్రీనివాస్, చంద్రమోహన్, మంత్రి శంకర్, శిలగానిశ్రీనివాస్, సార్ల సమ్మయ్య, గణేశ్ పాల్గొన్నారు.

## దివ్యాంగులందరికీ ఉపకరణాలు అందించాలి

పెద్దపల్లి/పెద్దపల్లి రూరల్, నవంబర్ 5: జిల్లాలోని దివ్యాంగులందరికీ సహాయ ఉపకరణాలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లి మున్సిపల్‌తో పాటు నియోజకవర్గంలోని దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను అందించేందుకు మంగళవారం ఎంపిక శిబిరం ఏర్పాటు చేశారు. కలెక్టర్ జిల్లా సంక్షేమశాఖ అధికారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మార్కెట్ కార్యాలయానికి రావడంతో మార్కెట్ అధికారులు ఒక్కసారిగా హైరానా పడ్డారు. పత్తి కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులను తీసుకొచ్చి కలెక్టర్‌కు చూపించారు. పత్తి కొనుగోళ్ల విషయమై ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. జేఎన్‌టియూహెచ్ రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ పలువురు రైతులతో కలిసి పెద్దపల్లిలో సీసీఐ పత్తికొనుగోళ్లు ప్రారంభించలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వ్యాపారులు తక్కువ ధరకే పత్తిని కొనుగోలు చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారని వివరించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు పెద్దపల్లిలో ప్రారంభించేలా చూడాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి పీ వేణుగోపాల్‌రావు, కార్యాలయ పర్యవేక్షకుడు కొట్టె రాజయ్య, సీడీపీవో కవిత, జితేందర్, ఉమాదేవి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, కార్యదర్శి దేవిరాజ్ పృథ్వీరాజ్ ఉన్నారు.

**క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలి**

జిల్లాలో పెండింగ్ లే అవుట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఎల్1 లాగిన్ ప్రక్రియ చివరి దశకు చేరుకుందన్నారు. పెండింగ్ దరఖాస్తులను వారం లోగా, ఎల్ 2 లాగిన్‌లో ఉన్న దరఖాస్తులను ఈనెల 15 నాటికి పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణ శ్రీ, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రం తనిఖీ**

కమాన్‌పూర్, నవంబర్ 5: పేరపల్లి శివారులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన వడ్ల వివరాలు తెలుసుకున్నారు. రైతులకు త్వరగా ధాన్యం డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఏవో రామకృష్ణ, ఆర్ఐ గౌతమ్, ఏపీఎం శైలజా శాంతి ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగుల చవితి ఉత్సవాలు

మంథని/మంథని రూరల్/ కమాన్‌పూర్/ కాల్వశ్రీరాంపూర్/ కోల్‌సిటీ/ రామగిరి/పెద్దపల్లి రూరల్, నవంబర్ 5 : జిల్లాలో మంగళ వారం నాగుల చవితి ఉత్సవాలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. నాగదేవతా విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గోదావరిఖనిలో బీఆర్ఎస్ నేతకు చెందిన సిరిఫంక్షన్ హాలును కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

# బీఆర్ఎస్ నేతలే టార్గెట్

- రామగుండంలో 'ఆపరేషన్ కూల్చివేత'
- కార్పొరేటర్ పెంట రాజేశ్ ఫంక్షన్ హాల్ నేలమట్టం
- నాలాపై నిర్మించారంటూ నెల కిందట నోటీసులు
- స్పందించలేదంటూ బందోబస్తు మధ్య కూల్చివేత

కోల్‌సిటీ, నవంబర్ 5: రామగుండం నగరంలో బీఆర్ఎస్ నేతలే టార్గెట్‌గా ఆపరేషన్ కూల్చివేతల పర్వం కొనసాగుతున్నది. నిన్నటికి నిన్న గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని బీఆర్ఎస్ కార్యాలయాన్ని కూల్చివేసిన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, తాజాగా మంగళవారం ఉదయాన్నే అడ్డగుంటపల్లిలోని బీఆర్ఎస్ 37వ డివిజన్ కార్పొరేటర్ పెంట రాజేశ్‌కు చెందిన సిరి ఫంక్షన్ హాల్‌ను కూల్చడం సంచలనంగా మారింది. ఫంక్షన్ హాల్‌ను నాలాపై నిర్మించారనీ, అనుమతులు లేని కారణంగా నెల రోజుల కింద నోటీసులు జారీ చేశామనీ, యజమాని స్పందించని కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు నోటీసులను బేఖాతరు చేసినందుకు కూల్చివేశామని అదనపు కలెక్టర్, నగర కమిషనర్ జే అరుణ శ్రీ తెలిపారు.

**కొంత సమయం అడిగినా పట్టించుకోలె**

విషయం తెలుసుకొన్న రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కార్యకర్తలు వెంటనే అడ్డగుంటపల్లికి చేరుకున్నారు. కూల్చివేత వద్దని, కొంత టైం కావాలని కోరుకంటి చందర్ కలెక్టర్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు. అక్కడున్న అధికారులతో కొంత సమయం ఇవ్వాలనీ, లేదంటే జరిమానా విధిస్తే చెల్లిస్తారని చెప్పినా వినిపించుకోలేదు. గోదావరిఖని వన్ టౌన్ పోలీసుల బందోబస్తు మధ్య అధికారులు కూల్చివేసేందుకు ప్రయత్నం చేయగా, ఫంక్షన్ హాలు యజమాని పెంట రాజేశ్ కుటుంబ సభ్యులు జేసీబీ ముందు నేలపై పడుకొని అడ్డుకున్నారు. మహిళా హోంగార్డుల సాయంతో వారిని అదుపులోకి తీసుకొని అనంతరం ఫంక్షన్ హాలును నేలమట్టం చేశారు. నగర పాలక సంస్థలో మరో మూడు ఫంక్షన్ హాళ్లకు సైతం నోటీసులు జారీ చేసామనీ, త్వరలో వాటిపై కూడా చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు. మిగతా ఫంక్షన్ హాళ్ల జోలికి వెళ్లకుండా కేవలం బీఆర్ఎస్ నేతకు సంబంధించిన ఫంక్షన్ హాలును మాత్రమే కూల్చివేయడం పలు ఆరోపణలకు తావిచ్చింది. బీఆర్ఎస్ కార్యాలయాన్ని కూల్చివేసిన మరుసటి రోజునే పార్టీ నేత ఫంక్షన్ హాల్‌ను నేలమట్టం చేయడంతో రామగుండంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

### కక్ష సాధింపు చర్యే



ఇది ముమ్మాటికి కక్ష సాధింపు చర్యే. ఇంతకింతకు భారీ మూల్యం చెల్లించక తప్పదు. స్థానిక ఎమ్మెల్యే ఇందుకు సమాధానం చెప్పి తీరాలి. ఇప్పటివరకు రామగుండానికి ఎంతోమంది ఎమ్మెల్యేలుగా పని చేశారు. కానీ, ఇంతటి దుర్మార్గమైన పాలన ఎక్కడా చూడలేదు. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇలాంటి రాజకీయాలు చేయలేదు. పారిశ్రామిక ప్రాంతంలో అనుమతి లేని నిర్మాణాలు, కమ్యూనిటీ హాళ్లు ఎన్నో ఉన్నాయి. వాటికి అనుమతుల కోసం జరిమానాలు విధించాలి, లేదంటే సీజ్ చేయాలి. కానీ, ఇలా దుర్మార్గంగా ఆస్తుల విధ్వంసం మంచిది కాదు. రామగుండంలో బీఆర్ఎస్ నేతలే టార్గెట్‌గా రాక్షస పాలన జరుగుతున్నది. అభివృద్ధి పేరిట విధ్వంసం సాగుతున్నది. పెంట రాజేశ్‌కు చెందిన ఫంక్షన్ హాల్‌కు అన్ని అనుమతులు ఉన్నప్పటికీ ఇంత అర్ధాంతరంగా కూల్చివేయాల్సిన అవసరం ఏమొచ్చింది? కొంత సమయం ఇవ్వాలని కోరినప్పటికీ బలవంతంగా కూల్చివేశారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణితోనే ఇదంతా చేస్తున్నరు. బీఆర్ఎస్ కార్యకర్తలను చంపుతారా? చంపితే చంపండి. కానీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా ఆస్తుల విధ్వంసాన్ని మానుకోండి.

- కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే

### అనుమతులున్నా కూల్చివేశారు



ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి సహకరించాలని అడిగారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరమన్నరు. నేను ఒప్పుకోలేదు. నేను మొదటి నుంచి బీఆర్ఎస్‌లోనే ఉంటున్న. నాపై కావాలనే కక్ష గట్టి ఫంక్షన్ హాలును కూల్చివేశారు. ఎన్నో ఏండ్లుగా ఉన్న ఈ ఫంక్షన్ హాలుకు అన్ని అనుమతులు ఉన్నాయి. నోటీసులు ఇచ్చాక మున్సిపల్ అధికారులను కలిసి సరైన పత్రాలు కూడా చూపించా. నాపై కక్ష గట్టి ఫంక్షన్ హాలు కూల్చడం సరికాదు. ఇంతటి రాక్షస పాలన ఎక్కడా చూడలేదు. ప్రజల ఆస్తులను ధ్వంసం చేయడం వల్ల ఒరిగేదేమిటి. ఎంతో మందికి ఉచితంగా సామూహిక వివాహాలు చేయించా. ఫంక్షన్ హాలు ఆదాయాన్ని సామాజిక సేవకే వినియోగిస్తున్నా. అధికారం ఉంది కదా..? అని దుర్మార్గమైన పాలన సాగిస్తే ప్రజలే గుణపాఠం చెప్తారు.

- పెంట రాజేశ్, ఫంక్షన్‌హాల్ యజమాని

## సీపీఐ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

పెద్దపల్లి టౌన్, నవంబర్ 5: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆవిర్భవించి డిసెంబర్ 26కు వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వాడవాడనా ఘనంగా వేడుకలు నిర్వహించాలని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ కార్యాలయంలో మంగళవారం సీపీఐ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ వెంకట రెడ్డి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో కులాల మధ్య చిచ్చురేపుతూ పాలన సాగిస్తున్నదని ఆరోపించారు. జమిలి ఎన్నికలు అమలు చేసి రాష్ట్రాలను తన గుప్పిట్లోకి తీసుకునేందుకు కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. దేశంలో రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించడంలో కేంద్రం విఫలమవుతున్నదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్, జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, నాయకులు గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కన్నెబోయిన కనకరాజు, తాళ్లపల్లి మల్లయ్య, ఆసాల రమ, కడారి సునీల్, ఓదెమ్మ, కొడం స్వామి, చంద్రగిరి ఉదయ్‌కుమార్, కందుకూరి రాజారత్నం పాల్గొన్నారు.

## సింగరేణిని రక్షించుకుందాం

గోదావరిఖని, నవంబర్ 5: సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ నుంచి రక్షించుకుందామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. జీడీకే ఓసీపీ 5లో మంగళవారం జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సంస్థ అభివృద్ధి కోసం కార్మికులు , ఉద్యోగులు, అధికారులు, యూనియన్లు కలిసికట్టుగా భవిష్యత్ తరాల కోసం ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి ఉన్న రూ.34వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సంస్థ మనుగడ కొనసాగడం కష్టమన్నారు. సింగరేణి గుర్తించిన గనులను వేలం ద్వారా ప్రైవేట్‌కు ఇవ్వకుండా సింగరేణికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు యూనియన్లకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఏఐటీయూసీలో చేరారు. ఇక్కడ ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, నాయకులు ఆరెల్లి పోశం, జీగురు రవీందర్, ప్రభుదాస్, రంగు శ్రీనివాస్, మాదన మహేశ్, సంకె అశోక్, చక్రపాణి, గండిప్రసాద్, చంద తిరుపతి ఉన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
CHANGE OF NAME
★ I, BANOVATH SANGEETHA alias SANGEETHA BANOTH, W/o. Banovath Rajesh, R/o. 6-42, Potharam, Kathalapur, Mandal Jagitial, Telangana-505 306. Changed My Name to BANOVATH SANGEETHA.
NT-339382
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## బైక్‌ను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

ధర్మారం, నవంబర్ 5: కటికెనపల్లి వద్ద కరీంనగర్ –రాయపట్నం రహదారిలో మంగళవారం సాయంత్రం బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ లక్ష్మణ్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం చెగ్యాంకు చెందిన దశముఖ నాగరాజు కారు డ్రైవ్ చేసుకుంటూ కరీంనగర్ వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో కటికెనపల్లికి చెందిన పెసరి స్వామి (50),ఆశయ్య బంజేరుపల్లి వైపు గ్రామానికి బైక్‌పై వస్తున్నారు. స్వామి కటికెనపల్లి బస్ స్టేజీ సమీపంలో బైక్‌ను క్రాస్ చేస్తుండగా నాగరాజు అజాగ్రత్తగా కారు నడిపి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైక్‌పై నుంచి ఇద్దరు ఎగిరి కిందపడ్డారు . స్వామి తల పగిలి తీవ్ర రక్త స్రావం కావడంతో ఘటనా స్థలంలోనే మరణించాడు. ఆశయ్య కాలు విరగడంతో పాటు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. స్వామి గ్రామంలో హోటల్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. స్వామి మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## శతాధిక వృద్ధురాలు మృతి



పోచమ్మ(ఫైల్)

ఓదెల, నవంబర్ 5: ఓదెలకు చెందిన చింతం పోచమ్మ(108) మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పోచమ్మ చనిపోయే వరకు కూడా ఆమె పనులు ఆమెనే చేసుకునేదని పేర్కొన్నారు. భర్త లింగయ్య 50 ఏళ్ల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి కొడుకు రాజయ్య వద్దే ఉంటుంది. ప్రస్తుతం ఆమె కొడుకుకు 80 ఏళ్లు ఉంటాయి. పోచమ్మ మనుమలు, మునిమనుమలను చూసింది.

## రౌడీషీటర్‌కు పీడీయాక్ట్ ఉత్తర్వులు అందజేత

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 5: రామగుండం పోలీసు కమిషనరేట్ మంచిర్యాలలోని ప్రజలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేస్తున్న మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన కుంట శ్రీనివాస్‌పై పీడీయాక్టు నమోదైంది. ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న నిందితుడికి మంచిర్యాల సీఐ ప్రమోద్‌రావు ఉత్తర్వులు అందజేశారు. అనంతరం నిందితుడిని పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు. కుంట శ్రీనివాస్ కొన్ని నెలలుగా మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్యాయత్నం, భూకబ్జాలకు పాల్పడడం, అక్రమంగా ఇతరుల ఆస్తిలోకి ప్రవేశించడం, బెదిరింపులు, దాడులకు పాల్పడడంతో నాలుగు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో జైలులో ఉండగా పీడీయాక్టు అమలుతో ఉత్తర్వులు అందజేసినట్లు వివరించారు.

## అంగన్‌వాడీ ఆయా మృతి

ముత్తారం, నవంబర్ 5: లక్కారం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా వేల్పుల కొమురమ్మ (60) మంగళవారం గుండెపోటుతో మృతి చెందింది. లక్కారంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తున్న కొమురమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నది. ఆమెను కరీంనగర్‌లోని దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. మంగళవారం నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతుండగా గుండెపోటు రావడంతో కొమురమ్మ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఓదెల, నవంబర్ 5: ఓదెల జడ్పీ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి సూర్యచంద్ర రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పద్మ తెలిపారు. హుజూరాబాద్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు . ఈ నెల 8 నుంచి 10వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థితో పాటు పీడీ రాజేందర్‌రెడ్డిలను ఉపాధ్యాయులు అభినందించారు.

అంతర్గాం, నవంబర్ 5: లింగాపూర్ మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని ఏ శ్రీవల్లి రాష్ట్ర స్థాయి షార్ట్‌పుట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సదానందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో సోమవారం జరిగిన ఎస్‌జీఎఫ్–14 షార్ట్ పుట్ పోటీల్లో శ్రీవల్లి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఖమ్మంలో జరగబోయే రాష్ట్ర స్థాయి మీట్‌కు ఎంపికైనట్లు వివరించారు. మంగళవారం విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

## క్రీడాకారులకు అభినందన

యైటింక్లయిన్‌కాలనీ, నవంబర్ 5 : ఈ నెల 3న హైదరాబాద్‌లో జరిగిన కరాటే–తైక్వాండో పోటీల్లో స్పందన పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్ క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో సీఐ ఎన్ ప్రసాద్‌రావు, హెచ్ఎం రవీందర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్జీఫ్ జిల్లా స్థాయి టెన్నిస్ ఎంపిక పోటీలు

మంథని, నవంబర్ 5: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్జీఫ్ జిల్లా స్థాయి లాన్ టెన్నిస్ అండర్–14, 17 ఎంపిక పోటీలను మంథని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలను మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేశ్ రెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీరాంభట్ల సంతోష్, కౌన్సిలర్ నక్క నాగేంద్ర, ఎస్జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్, లాన్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బొజ్జ విజయ్‌కుమార్, సుంకరి జగదీష్, పీఈటీలు పాల్గొన్నారు.

## వాలీబాల్ కిట్ అందజేత

జ్యోతినగర్, నవంబర్ 5 : జంగాలపల్లికి చెందిన యువతకు కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఈదునూరి మల్లేశ్ వాలీబాల్ కిట్ వితరణ చేయగా ఎన్టీపీసీ ఎస్ఐ సతీశ్ క్రీడాకారుకులు మంగళవారం అందజేశారు. ఇక్కడ నాయకులు ఈదునూరి రవి, జంగాలపల్లి యూత్ ప్రెసిడెంట్ శ్రీకృష్ణుడు, రవీందర్, తిరుపతి, క్రాంతి, నారాయణ, తదితరులు ఉన్నారు.

## హైటెన్షన్ టవర్‌ఎక్కి యువకుడి హల్‌చల్

పెద్దపల్లి రూరల్, నవంబర్ 5 రాఘవాపూర్‌కు చెందిన ఎంజాల రాకేశ్ హైటెన్షన్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. కొద్ది రోజులుగా రాకేశ్ మానసిక స్థితి బాగా లేదని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పేర్కొంటున్నారు. నాలుగు రోజుల క్రితం సుల్తానాబాద్‌లో హైటెన్షన్ టవర్ ఎక్కాడు. పోలీసులు నచ్చ జెప్పి కిందకు దించారు. మంగళవారం రాఘవాపూర్ బస్టాండ్ సమీపంలో మంథని వెళ్లే మార్గంలో గుట్టవైపు ఉన్న హైటెన్షన్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అతని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చి కిందకు దించే ప్రయత్నం చేశారు.

## రథయాత్రకు ఘన స్వాగతం

మంథని, నవంబర్ 5: అయోధ్యలో ప్రతిష్టించబోయే రామ యంత్ర రథయాత్ర మంగళవారం రాత్రి మంథనికి చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులు ఘన స్వాగతం పలికారు. సుమారు 150 కిలోల బంగారు పూతతో తయారు చేసిన రామయంత్ర రథయాత్ర మంథని చేరుకోవడంతో పెద్ద సంఖ్యలో భక్తులు మేళ తాళాలతో స్వాగతం పలికారు. స్థానిక గాంధీచౌక్ నుంచి పురవీధుల గుండా శోభాయాత్ర కొనసాగింది. ఈ యాత్రలో కో–ఆర్డినేటర్ బొబ్బిలి శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు వైద్య పరీక్షలు

కోల్‌సిటీ, నవంబర్ 5: గోదావరిఖని తిలక్‌నగర్ ఆటో యూనియన్ సభ్యులకు కరీంనగర్ మెడికవర్ దవాఖాన ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా గుండె వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. యూనియన్ అధ్యక్షుడు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి రాజేందర్ శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ దీక్షిత్ దాదాపు 150 మంది ఆటో డ్రైవర్లకు వైద్య పరీక్షలు చేశారు. తమ ఆస్పత్రిలో అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని దవాఖాన హెడ్ గుర్రం కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం సురేశ్, సంపత్, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, హరీశ్, యూనస్ పాల్గొన్నారు.

## మెరుగైన బోనస్ ఇచ్చే దాకా రిలే దీక్ష

పాలకుర్తి, నవంబర్5: కేశోరాం పర్మినెంటు కార్మికులకు యాజమాన్యం మెరుగైన బోనస్ ఇచ్చే దాకా రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తామని యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి తెలిపారు. రెండో రోజు దీక్షలో 15 మంది కార్మికులతో పాటు, యూనియన్ వర్కింగ్‌ప్రెసిడెంట్ పర్శవేణి శ్రీనివాస్‌యాదవ్, ప్రధానకార్యదర్శి దాడి మహేష్, మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు. కేశోరాం కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై మద్దతు ప్రకటించారు.

## సర్వే సిబ్బందికి పూర్తి సమాచారం ఇవ్వాలి

కోల్‌సిటీ, నవంబర్ 5: రామగుండం కార్పొరేషన్‌లో బుధవారం నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం కానుందని, సిబ్బందికి పూర్తి సమాచారం ఇవ్వాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కమిషనర్ జే అరుణ శ్రీ కోరారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహణకు రామగుండం కార్పొరేషన్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్పొరేషన్‌లో మొత్తం 65,847 ఇండ్లను గుర్తించినట్లు వివరించారు. బుధవారం నుంచి ఇంటింటికీ వచ్చే సర్వే సిబ్బందికి ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, పట్టాదారు పాస్ బుక్ కాపీలు చూపించాలని కమిషనర్ కోరారు.

**ఎన్యుమరేటర్లకు శిక్షణ**

జ్యోతినగర్, నవంబర్ 5: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే బుధవారం నుంచి చేపట్టనుండగా, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఎన్టీపీసీ ఈడీసీ మిలినీయం హాలులో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) అరుణశ్రీ శిక్షణ ఏర్పాటు చేశారు. డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ లింగారెడ్డి ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఇక్కడ తహసీల్దార్ కుమారస్వామి, కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ రాజలింగు, ఎంఈవో గడ్డం చంద్రయ్య, ఏసీపీ శ్రీధర్ ప్రసాద్, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ పబ్బాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పరామర్శ

జూలపల్లి, నవంబర్ 5 : కాచాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుడు గండు భగవంతరావు తండ్రి హన్మయ్య ఇటీవల మృతిచెందాడు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ కలిసి మంగళవారం భగవంతరావును పరామర్శించారు. హన్మయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. వారి వెంట జూలపల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ కంది చొక్కారెడ్డి, మాజీ ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం, నాయకులు అడప లక్ష్మణ్, గండు మల్లారెడ్డి, నారగోని శంకరయ్య, దాడి కొమురయ్య, మారం రాజయ్య, దాడి గంగయ్య ఉన్నారు.

## 5 కే రన్ ప్రారంభం

జూలపల్లి, నవంబర్ 5 : బీఆర్ఎస్ రాష్ట్ర నేత నల్ల మనోహర్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం మాజీ ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి పెద్దాపూర్ నుంచి జూలపల్లి దాకా 5 కే రన్‌ను ప్రారంభించారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. విజేతలకు నల్ల మనోహర్ రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్, నాయకులు కొప్పుల మహేశ్, బొజ్జ శ్రీనివాస్, తొగరు శ్రీనివాస్, మద్దెల స్వామి, ఉయ్యాల వెంకటేశ్, మద్దెల నరేశ్, మామిడిపెల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం

ఓదెల, నవంబర్ 5: కొలనూర్‌లో రోడ్డు వెడల్పు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఓదెల నుంచి కొలనూర్ మీదుగా జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డును బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మంజూరు చేయించారు. డబుల్ రోడ్డు పనులు పూర్తయిన కొలనూర్‌లో ఇరుకు రోడ్డు కారణంగా పనులు చేపట్టలేదు. గత నెలలో ప్రస్తుత ఎమ్మెల్యే విజయరమణారావు కొలనూర్‌లో పర్యటించి గ్రామస్తులతో చర్చించారు. 34ఫీట్లతో రోడ్డు వెడల్పునకు గ్రామస్తులు అంగీకారం తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇంటి గోడలను తొలగింపు పనులు చేపట్టారు. రోడ్డు వెడల్పుతో పాటు డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నారు.

## ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

పెద్దపల్లి, నవంబర్5: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి సర్కారు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యం రావు డిమాండ్ చేశారు. జీపీ కార్మికుల వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, బకాయిలు చెల్లించాలని పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట జీపీ కార్మికులు ఒక్క రోజు దీక్ష చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11నెలలవుతున్నా జీపీ కార్మికుల సమస్యలపై స్పందించక పోవడం సిగ్గుచేటని విమర్శించారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 20 తర్వాత సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతి పత్రం అందజేశారు. దీక్షలో పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటియూ) జిల్లా అధ్యక్షకార్యదర్శులు సీపెల్లి రవీందర్, ఎండీ ఖాజా, నాయకులు అశోక్ ,లచ్చయ్య, ఎండీ సోద్దిన్, శ్రీనివాస్ ,అంబాల లక్ష్మణ్, రాజయ్య, వైద్య సంపత్ రెడ్డి, మల్ల నాగేశ్వర్, నాగరాజు, ముస్తఫా, రవి, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## 'పుడా'గా తీర్మానం చేసి నివేదిక పంపిస్తాం

సుల్తానాబాద్, నవంబర్ 5 : పెద్దపల్లి నియోజకవర్గంలోని సుల్తానాబాద్‌ను కలుపుకొని (పుడా)గా మారుస్తూ జీవో జారీ చేసే విధంగా మున్సిపల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు తెలిపారు . పెద్దపల్లి జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) సాధన సమితి సభ్యులు సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు మంగళవారం వినతి పత్రం అందించారు. జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాల్సిన కార్యాలయాలు రామగుండంకు తరలిపోతున్నాయని పేర్కొన్నారు. దీంతో జిల్లా కేంద్రం అస్తిత్వాన్ని కోల్పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సుల్తానాబాద్ పురపాలక సంఘం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం మున్సిపల్ చైర్ పర్సన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బొంకూరి సురేందర్, భూషణవేని రమేశ్ గౌడ్, భాస్కర్‌యాదవ్, బొడ్డుపల్లి రామ్మూర్తి, అంజయ్య, అలువాల రాజేందర్, కల్లెపల్లి సతీశ్, కల్లెపల్లి రవి, తూముల శ్రీనివాస్, కాకటి రాజగోపాల్ తదితరులున్నారు.

## రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

సుల్తానాబాద్, నవంబర్ 5 : పట్టణంలోని చెరువు నుంచి హనుమాన్ ఆలయం చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, ఏఈ సతీశ్ మంగళవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కౌన్సిలర్ నిషాద్ రఫీక్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

ధర్మారం,నవంబర్ 5: సైబర్ నేరాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ జిలాల లీగల్ సర్వీసెస్ అథార్టీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేశ్ సూచించారు. కరీంనగర్ లీగల్ సర్వీసెస్ అథార్టీ ఆధ్వర్యంలో మల్లాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయం(టీజీఎస్‌డబ్ల్యుఆర్ఎస్)లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో లీగల్ సెల్ అథార్టీ డిప్యూటి సెక్రెటరీ తనుకు మహేశ్, న్యాయవాదులు, కళాశాల ప్రిన్సిపాల్ దేవసేన,అధ్యాపకులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

పెద్దపల్లి కమాన్, నవంబర్ 5 : పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, అన్ని డీఏలు, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. సమస్యల పరిష్కారం కోసం పెద్దపల్లి బస్టాండ్ ఎదుట టీపీయూఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతి పత్రం ఇచ్చారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, ఉమాపతి రెడ్డి, పుష్పలత, అనిల్, ప్రసాద్, శ్రీనివాసరావు, మహేందర్, మునిప్రసాద్, నరేశ్‌రెడ్డి, స్రవంతి, రమేశ్ బాబు, సుమిత్ర, రజిత, రాజేశ్వర్‌రావు, రవీందర్, జగన్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న పత్తి కొనుగోళ్లు

పెద్దపల్లి, నవంబర్5: పెద్దపల్లి ఏఎంసీలో పత్తి కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. మంగళవారం 289 మంది రైతులు 948 సంచుల్లో తీసుకవచ్చిన 1042 క్వింటాళ్ల పత్తిని వ్యాపారులు కొనుగోలు చేశారు. క్వింటాలుకు గరిష్ఠ ధర రూ. 6821, కనిష్ఠ ధర రూ. 5921 పలికిందని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ వెల్లడించారు.

## ప్రభుత్వంలో విలీనం చేయాలని వినతి

పెద్దపల్లి/ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్5:టీజీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, పని భారం తగ్గించాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ మంగళవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణ శ్రీకి టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ జిల్లా నాయకులు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ నాయకులు వంగర శ్రీనివాస్, కొమ్ము కొమురయ్య, మాతంగి తిరుపతి, కే శ్రీనివాస్, ఎస్ లింగయ్య, లింగయ్య, కే రమేశ్, జీ రమేశ్, టీ శ్రీనివాస్, బీ దేవేందర్, ఏఎన్ రావు, వీఎస్ కుమార్, పీ ప్రసాద్ ఉన్నారు.